క్లుప్తంగా

మహిళలను గౌరవించాలి
వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అనే అంశంపై కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి జ్ఞానమణి అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిని శిక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. మార్పు ట్రస్ట్ సభ్యురాలు సూయజ్ రావూరి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వైకే సుందరకృష్ణా, ప్రొఫెసర్ ఎన్. ఉష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు
రూ.4.92 లక్షల జరిమానా

పెడన: పెడన పట్టణంతో పాటు మండలంలోని విద్యుత్ వినియోగదారుల గృహ, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఈఈ ఎం. భాస్కరరావు ఆధ్వర్యంలో మచిలీపట్నం, పెడన విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 1,389 గృహాల సర్వీసులను, 60 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వీటిల్లో 157 సర్వీసులకు సంబంధించి 222 కిలోవాట్స్ అదనంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం రూ.4,92,000 జరిమానా విధించామని మచిలీపట్నం ఈఈ ఎం. భాస్కరరావు తెలిపారు. విద్యుత్ చౌర్యం జరిగితే వెంటనే సెల్: 94408 12362, 94408 12363, 83310 14951 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

టీడీపీకి రత్తయ్య రాజీనామా

కృత్తివెన్ను: పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీలో నాయకత్వ సమన్వయ లోపంతో పాటు సరైన గుర్తింపు లేదన్నారు. వీటితో పాటు పార్టీ సమన్వయ కమిటీ, యూనిట్ ఇన్‌చార్జి పదవులకు సైతం రాజీనామా చేస్తున్నామని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కోనేరుసెంటర్: మారుమూల గ్రామాలకు సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. తుమ్మలచెరువు గ్రామంలో రూ. 8 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేయనున్న మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తలారి శ్రీనివాసరావు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం



మచిలీపట్నంటౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక లేడియాంప్తిల్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తరగతుల విద్యార్థులు ఆదివాసీ వేషధారణలో ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు ఆదివాసీ పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయిని నిర్మల జ్ఞానమణి పర్యవేక్షించారు.

37 మందికి వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంఘ భవనంలో ఉచిత నేత్ర, దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తమాలజిస్ట్ చల్లా రాజేష్ 17 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వీరిలో ఆరుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి రాజమండ్రిలోని గౌతమి నేత్రాలయంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. అలాగే విజయవాడ దుహిత డెంటల్ కేర్ వైద్యురాలు కె. సుభద్ర 20 మందికి దంత వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు సిద్ధంకండి

బంటుమిల్లి: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో అర్హులైన యువకులు పాల్గొనాలని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 ఏళ్లు నిండిన యువకులు క్రికెట్టు, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే జట్ల తమ పేర్లను స్థానిక వలంటీర్లకు అందచేసి సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. వివరాలకు స్థానిక సచివాలయల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల పీడీలను సంప్రదించాలన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల ఖ్యాతిని చాటుదాం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వాడవాడలా ఆజాదీకా అమృత్ మహోత్సవ్
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



లక్ష్మీపురంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ఉత్తర చిరువోలులంకలో మొక్కలు నాటుతున్న దృశ్యం



దక్షిణ చిరువోలులంకలో రిటైర్డ్ ఎస్ఐ బాబూరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం



పల్లెపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ముంజులూరులో చలపతిరావు కుమారుడు రమణను సత్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్



ఉల్లిపాలెంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చిట్టిపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బాలకృష్ణ



గూడూరు సచివాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

లక్ష్మీపురం(చల్లపల్లి): దేశానికి స్వాతంత్ర్యం అందించిన స్వాతంత్ర్య సమర యోధుల ఖ్యాతిని భావి తరాలకు చాటి చెబుదామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు చేపట్టిన నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. పంచాయతీ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. అధికారులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, గ్రామ వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఖ్యాతి గురించి బాలబాలికలు తెలుసుకోవాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో పోరాటాలు చేసిన వారి కుటుంబ సభ్యుల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ గౌరవ భావం కలిగి ఉండటమే వారికి అందించే నిజమైన కానుక అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనేత సింహాద్రి వికాస్‌బాబు, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, డొక్కు నాగేశ్వరరావు, ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు, ఏపీఎం సీహెచ్ వీవీ.బాపనయ్య, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు పాల్గొన్నారు.

అమరవీరులకు వందనం..

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): అమరవీరులను స్మరించుకుంటూ వారు చేసిన త్యాగాలను గుర్తుచేసుకోవాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉత్తర చిరువోలులంక గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవం గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. అమర వీరుల త్యాగాలను వివరిస్తూ ప్రమిదలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీధుల్లో 75 మొక్కలు నాటారు. సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: మండల పరిధి ముంజులూరులో ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పర్యవేక్షణలో శిలాఫలకం ఆవిష్కరించి జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు భావరాజు వెంకట చలపతిరావు సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన కుమారుడు వెంకట రమణారావును ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కె. సునీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, నాయకుడు కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఏఓ శివరామకృష్ణ, ఎంఈఓ ఎ. వెంకటేశ్వరరావు, ఏపీఓ ముత్యాలు, ఏఈఈ పంచాయతీరాజ్ ఎ. చంద్రశేఖర్ పర్యవేక్షణలో పి. రావిగుంట, మల్లేశ్వరం, అర్తమూరు, మణిమేశ్వరం గ్రామాల్లో నా మట్టి–నాదేశం కార్యక్రమాలు నిర్వహించారు.

కోడూరు మండలంలో..

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం, జయపురం, మాచవరం పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఆయా సర్పంచులు వెర్రి పావని, పాలడుగు భార్గవి, తోట వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలాఫలకాలను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాల్లో మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ పాండురంగారావు, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దక్షిణ చిరువోలులంకలో..

దక్షిణ చిరువోలులంక(అవనిగడ్డ): దక్షిణ చిరువోలులంక ఎస్సీ కాలనీ సామాజిక భవనం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకృష్ణ జాతీయ జెండాను ఎగురవేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్ఐ బుస్సా బాబురావు–సునందమ్మ దంపతులతో పాటు పలువురు సీనియర్ సిటిజన్స్, మహిళలను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ సుమతీదేవి మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, నేలతల్లిని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, మాజీ సర్పంచ్ బుస్సా భాగ్యలక్ష్మి, కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: భారత దేశ ప్రగతికి నావంతు కృషి చేస్తానంటూ అధికారులు, పౌరులు నా దేశం–నా భూమి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. మండల పరిధిలోని చినపాండ్రాక, చెరుకుమిల్లి, నీలిపూడి, పల్లెపాలెం, గరిశపూడి పంచాయతీలలో నాదేశం– నాభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఏఓ జెస్సీ, ఎంఈఓ ప్రసాద్, ఏపీఎం దశరథరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: మండలంలోని అరిశేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణ పాల్గొన్నారు. చిట్టిపాలెంలోని అమృత్ సరోవర్ చెరువు వద్ద నా దేశం నా మట్టి కార్యక్రమంలో భాగంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్, పంచాయితీ కార్యదర్శి సుకుమార్, సీసీ సుధారాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా నా భూమి–నాదేశం

గూడూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గూడూరు-2 గ్రామ సచివాలయంలో బుధవారం నా భూమి నాదేశం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నేల తల్లికి నమస్కారం -వీరులకు వందనం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ సంగా మధుసూదనరావు పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబుతో కలిసి సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచి లింగం సులోచనారాణి, గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం పెదబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ఆకులమన్నాడు, చిట్టిగూడూరు, మద్దిపట్ల, పోలవరం, రామరాజుపాలెం, రాయవరం గ్రామాల్లో నా భూమి– నా దేశం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు,

మంచి చేసే వారిని మరువవద్దు

- సంక్షేమాభివృద్ధికి శ్రమిస్తున్న జగనన్నను ఆశీర్వదించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: ప్రజలకు మంచి చేసే వారిని ఎప్పుడూ మరువవద్దని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించేందుకు నిత్యం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం ఆయన పెడన మండలం నందిగామ గ్రామ సచివాలయం పరిధిలోని నందిగామ దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దళారీ వ్యవస్థ లేకుండా తమకు నేరుగా అందుతున్న పథకాల పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేశారు. మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం శ్రమిస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికమని, పథకాలను అందించడంలో ఎలాంటి అవినీతికి తావు లేదని స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. డ్రెయినేజీలు, అంతర్గత రహదారులు, గ్రామ చెరువుకు ర్యాంపును నిర్మించాలని గ్రామస్తులు మంత్రిని కోరగా, ర్యాంపు నిర్మాణానికి అంచనాలు రూపొందించి రూ.2.5 లక్షలు కేటాయిస్తానని వారికి హామీ ఇచ్చారు. మిగిలిన పనులు చేయిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆయా పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెడన మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, ఎంపీపీ రాజులపాటి వాణి, అచ్యుతరావు, వెంకట రామానాయుడు, కొండవీటి నాగబాబు, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ పి.మధుసూదనరావు, గృహ నిర్మాణ శాఖ డీఈ ఎ. శ్రీనివాసరావు, ఏఓ జీవీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కొంగంచర్ల సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు

పెడన: మండల పరిధి కొంగంచర్ల సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి లోయ ద్రాక్షాయణమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. జనరల్ మహిళకు రిజర్వు కావడంతో గొరిపర్తి ద్రాక్షాయణమ్మ అలియాస్ లోయ ద్రాక్షాయణమ్మ పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చల్లపల్లి ఈఓపీఆర్డీ బి. అశోక్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. కాకర్లమూడి వార్డు మెంబర్‌కు సంబంధించి ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని అధికారులు తెలిపారు.

కోకనారాయణపాలెం సర్పంచి పదవికి రెండు నామినేషన్లు

గూడూరు: కోకనారాయణపాలెం పంచాయతీ సర్పంచి పదవికి బుధవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. బండి అంజలి కుమారి రిటర్నింగ్ అధికారి నాగరేవతికి తన నామినేషన్ దాఖలు చేశారు. ఆమెతోపాటు కుమారుడు బండి ప్రతాప్‌కుమార్ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఆకులమన్నాడులోని 2వ వార్డుకు సాయన రామభ్రమరాంబ నామినేషన్ దాఖలు చేశారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో నిర్లక్ష్యాన్ని సహించం



గూడూరు: ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల బూత్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు పరిశీలన నిర్వహించాల్సి ఉందన్నారు. కొంత మంది బీఎల్‌ఓలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాంటి వారు తమ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే బీఎల్‌ఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి గైర్హాజరైన బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆమె తహసీల్దార్ బి.విజయప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, డీటీ శివశంకర్, ఆర్ఐ నస్రీన్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకు మేలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

లక్ష్మీపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల కష్టాలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతుంటే.. ప్రతిపక్ష నాయకులు తమ కార్యకర్తలను రెచ్చగొట్టి అరాచకాలు సృష్టిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–2 పరిధిలోని శివరామదుర్గాపురం, రామానగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు గ్రామంలో 727 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

పేర్ని కిట్టు



లబ్ధిదారుకు రైస్‌కార్డు అందజేస్తున్న పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్ విజయలక్ష్మి

మచిలీపట్నంటౌన్: పేద ప్రజల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 26వ డివిజన్ సర్కిల్‌పేట ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బ్రోచర్లను అందజేశారు.

డివిజన్‌లో కొత్తగా మంజూరైన రైస్ కార్డులను లబ్ధిదారులకు కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మితో కలిసి రైస్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. నగరంలోని 11వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గూడవల్లి నాగరాజు లబ్ధిదారులకు రైస్‌కార్డులను అందజేశారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



విద్యార్థినులకు సైకిళ్లు అందించిన సర్పంచ్ సుధాకీర్తన, డీడీ రామారావు తదితరులు

ఎదురుమొండి(నాగాయలంక): అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌డీఎఫ్ (నెదర్లాండ్) ఆర్థిక సహకారంతో పాఠశాల విద్యార్థినులు 30 మందికి సైకిళ్లను అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కన్నా సుధాకీర్తన, అసిస్ట్ డెప్యూటీ డైరెక్టర్ ఎంవీ రామారావు చేతుల మీదుగా స్థానిక హైస్కూల్ బాలికలు 17 మందికి, బాపట్ల జిల్లా లక్ష్మీపురం (రేపల్లె మండలం) గ్రామానికి చెందిన 13 మందికి సైకిళ్లను అందజేశారు.

సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దీవుల్లో ప్రజలకు సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. రామారావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా దీవుల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. సంస్థ ఏరియా ఇన్‌చార్జి డి.వెంకట్రావు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి జి.కనకదుర్గ, హెచ్ఎం స్వర్ణలత, కోటేశ్వరరావు, వి.అంకరాజు, పీఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్‌కు పాముకాటు

కోనేరుసెంటర్: మండల పరిధిలోని రుద్రవరం గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న బడుగు రవి బుధవారం పాముకాటుకు గురయ్యాడు. పాఠశాలలో మూతబడిన గదులను (స్టోర్ రూమ్స్) శుభ్రం చేయాలని ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ ఆదేశించారు. దీనితో వాచ్‌మెన్ రవి రూములను శుభ్రం చేస్తుండగా అప్పటికే గదిలో ఉన్న పాము రవిని కాటు వేసింది. రవిని బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పోయినవి

మచిలీపట్నం, రుస్తుంబాద, డోర్ నెంబర్ : 13/132 (13/124), అంబటి కాంతారావు అను నాకు చెందిన ఇంటి దస్తావేజులు నెం : 3731/1983 ది : 22-06-2023 గురువారం మా ఇంటి వద్ద నుంచి ఈసి. తీయించుకునే నిమిత్తం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును. సంప్ర : 98491 58590

ముదిరాజుపాలెంలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న పర్ణం పెదబాబు తదితరులు

గూడూరు: మల్లవోలు శివారు ముదిరాజుపాలెంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బండారు కుమారికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఉదయం వంట చేస్తుండగా ఇంటికి అంటుకున్న నిప్పు ఒక్కసారిగా ఇల్లంతా వ్యాపించింది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బందరు అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది.

భర్త అర్జునరావు చనిపోవడంతో బండారు కుమారి ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ప్రమాదంలో సామానంతా కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలింది. సర్పంచి బొర్రా సాంబశివయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం పెదబాబు, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి బాధితురాలిని పరామర్శించారు, ప్రభుత్వపరంగా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాధితురాలికి ఆర్థికసాయం

గూడూరు: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన బండారు కుమారికి వైఎస్సార్ సీపీ నాయకులు తమ వంతుగా రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం, వంట సామగ్రి అందజేశారు. సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి, నాయకులు సోమరైతు రాంబాబు, తుమ్మల శివబసవయ్య, వీఆర్వో చలమలశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ బాధ్యత అందరిదీ

అవనిగడ్డ: బాలల చదువు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ప్రాజెక్టు డైరెక్టర్ పి. సువర్ణకుమారి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బాలల చట్టాలపై అవగాహన, సామర్థ్యం పెంపు అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, పరిరక్షణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా ఇన్‌చార్జి జాన్సన్, లీగల్ అడ్వైజర్ శ్రీహరి, కో–ఆర్డినేటర్ నాగరాజు, సీడీపీఓ శేషుకుమారి, ఏఎస్ఐ సారథి పాల్గొన్నారు.

రేపు పెయ్యిదూడల అందాల పోటీలు

మోపిదేవి: పెయ్యిదూడల అందాల పోటీలు మోపిదేవి పశు వైద్యశాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం. నందకిషోర్ తెలిపారు. 8 నెలల లోపు ఆవుజాతి, గేదె జాతి దూడలతో యజమానులు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు.